సాక్షి ప్రకాశం

గురువారం । 1 । జూన్ । 2023



నృసింహుని బ్రహ్మోత్సవాలకు శ్రీకారం
పాత సింగరాయకొండ వరాహ లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలు ధ్వజారోహణతో బుధవారం ఉదయం ప్రారంభమయ్యాయి.
- 8లో..



సినీ ఫక్కీలో రూ.1.50 లక్షలు చోరీ
బ్యాంకులో డ్రా చేసి స్కూటీ సీటు కింద పెట్టిన రూ.2 లక్షల నగదులో రూ.1.50 లక్షలు చోరీ చేసిన ఘటన చీమకుర్తిలో జరిగింది.
- 8లో..

గరిష్ఠం/కనిష్ఠం
39 /28

వాతావరణం
ఆకాశం అక్కడక్కడా మేఘావృతమై ఉంటుంది. ఉక్కపోతగా ఉంటుంది. పగటి ఉష్ణోగ్రతలు అధికం.

న్యూస్‌రీల్

62 మంది కానిస్టేబుళ్ల బదిలీ

ఒంగోలు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం బదిలీలకు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో జిల్లాలో పలువురు కానిస్టేబుళ్లను బదిలీ చేస్తూ ఎస్పీ మలికా గర్గ్ ఉత్తర్వులిచ్చారు. వివిధ పోలీసు స్టేషన్లలో ఐదేళ్ల కాల పరిమితి పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్లను బదిలీ చేశారు. ఇందుకోసం కానిస్టేబుళ్ల నుంచి విల్లింగ్ తీసుకున్నట్టు సమాచారం. ఖాళీలను బట్టి ప్రాధాన్యత క్రమంలో ఒక్కొక్కరి నుంచి ఏడు స్టేషన్ల వివరాలు తీసుకుని, వీలైనంత మేరకు కానిస్టేబుళ్లు కోరుకున్న చోట పోస్టింగ్ ఇచ్చేందుకు ప్రయత్నించినట్టు తెలుస్తోంది. దీంతో అత్యధిక శాతం కానిస్టేబుళ్ల నుంచి సంతృప్తి వ్యక్తమవుతోంది. మరికొంత మంది కానిస్టేబుళ్లకు కూడా స్థానచలనం తప్పదని తెలుస్తోంది.

నేటి నుంచి మలేరియా నివారణ మాసోత్సవాలు


ఒంగోలు అర్బన్: జిల్లాలో ఈ నెల 1 నుంచి 30వ తేదీ వరకు మలేరియా నివారణ మాసోత్సవాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా మలేరియా నివారణ అధికారి జ్ఞానశ్రీ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మాసోత్సవాల్లో ప్రజలకు దోమ కాటుతో వచ్చే వ్యాధులు, దోమలు కుట్టకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పరిసరాల పరిశుభ్రత, వ్యాధి లక్షణాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పంచాయతీ, వైద్య ఆరోగ్య శాఖ, మున్సిపాలిటీలు, ఐసీడీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్ పొదుపు సంఘాల మహిళలతో కలసి సమన్వయంగా వసతి గృహాలు, మురుగు కాలువలు, గ్రామాల్లో పారిశుద్ధ్యం వంటి పనులను పరిశీలిస్తారు.

4న అరుణాచలానికి స్పెషల్ హైటెక్ బస్సు

ఒంగోలు: పౌర్ణమి సందర్భంగా జూన్ 4న అరుణాచలంలో జరిగే గిరి ప్రదక్షిణకు ఒంగోలు బస్టాండు నుంచి ప్రత్యేక హైటెక్ బస్సు ఏర్పాటు చేసినట్లు ఆర్టీసీ ఒంగోలు డిపో మేనేజర్ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బస్సు జూన్ 3వ తేదీ ఉదయం 6 గంటలకు ఒంగోలు నుంచి బయల్దేరి రాత్రికి అరుణాచలం చేరుకుంటుంది. గిరి ప్రదక్షిణ పూర్తయిన తరువాత మరుసటిరోజు ఉదయం అరుణాచలంలో బయల్దేరి కాణిపాకం, శ్రీపురం, గోల్డెన్ టెంపుల్, దేవాలయాలను దర్శించుకుని అదే రోజు రాత్రికి ఒంగోలుకు చేరుకుంటుందన్నారు. టికెట్టు ధర రూ.2 వేలుగా నిర్ణయించారని, ఇతర వివరాలకు సెల్ 9959225695 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

సర్కార్ బడులు తెరిచిన రోజే విద్యార్థులు అపురూప కానుకను అందుకోనున్నారు. పాఠశాలలోకి అడుగుపెట్టిన క్షణంలోనే ఎనిమిది రకాల వస్తువులతో కూడిన కిట్‌ను తీసుకోనున్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక ప్రైవేటు పాఠశాలలకు దీటుగా సర్కారు బడులను తీర్చిదిద్దుతోంది. తరగతి గదిలోకి పేద, మధ్య తరగతి పిల్లలు కూడా సంతోషంగా సకల సౌకర్యాలతో అడుగుపెట్టేలా జగనన్న విద్యాకానుకను అందిస్తోంది. విద్యా సంవత్సరం తొలి రోజే కావాల్సిన సామగ్రిని అందించి వారిఆత్మవిశ్వాసం నింపేలా చర్యలు చేపడుతోంది. విద్యాకానుకలను ఇప్పటికే మండల కేంద్రాలకు చేర్చారు.

తొలిరోజే అపురూపం...



- జగనన్న విద్యాకానుక కిట్లు సిద్ధం
- ఇప్పటికే మండల కేంద్రాలకు చేరిన కానుకలు
- తరగతుల వారీగా విభజన
- మొదటి వారంలోనే ఆయా పాఠశాలలకు చేరేలా ప్రణాళిక
- కానుక అందుకోనున్న 2.17 లక్షల మంది విద్యార్థులు

దర్శి టౌన్: వేసవి సెలవులు ముగించుకొని పాఠశాలలు తెరిచే సమయానికి విద్యార్థులకు జగనన్న విద్యా కానుక అందించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేస్తున్నారు. జిల్లాలో సుమారు 2.17 లక్షల మంది విద్యార్థులకు తొలిరోజే విద్యాకానుకలు అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత విద్యా రంగానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా అమ్మ ఒడి, నాడు–నేడు, జగనన్న విద్యా దీవెన, జగనన్న వసతి దీవెన వంటి పథకాలతో పాటుగా జగనన్న విద్యాకానుక విద్యార్థులకు ఎంతో అండగా ఉంటోంది.

జిల్లాలో ఇదీ పరిస్థితి...

జిల్లాలో 2,17,080 లక్షల మంది విద్యార్థులు ఉన్నట్లు అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వారికి సంబంధించిన తరగతుల వారీగా వివిధ రకాల పుస్తకాలు, స్టేషనరీలు, ఇతర వస్తువులు అందించాల్సి ఉంది. ఆయా పాఠశాలల నుంచి ప్రధానోపాధ్యాయులు అందించిన వివరాల ప్రకారం సంబంధిత ఎమ్మార్సీలకు ఇప్పటికే సామగ్రి చేరింది.

ఎనిమిది రకాల వస్తువులు..

ప్రభుత్వ యాజమాన్యానికి సంబంధించి వివిధ పేర్లతో నడుపుతున్న విద్యా సంస్థల్లోని విద్యార్థులకు జగనన్న విద్యా కానుక పేరుతో అభ్యాసన సామగ్రి, వస్తువులను అందజేస్తున్నారు. ప్రభుత్వ విద్యా సంస్థలో చేరిన ప్రతి విద్యార్థి చదువుకు అవసరమైన సామగ్రిని ఉచితంగా అందించేలా ప్రభుత్వం ప్రత్యేకంగా శ్రద్ధ చూపుతోంది. విద్యార్థులకు అందించే జగనన్న విద్యాకానుకలో ఎనిమిది రకాల వస్తువులను ఉంచుతారు. అందులో మూడు జతల యూనిఫాం, పాఠ్య పుస్తకాలు, నోట్‌పుస్తకాలు, ఇంగ్లిషు డిక్షనరీ, బెల్ట్, బూట్లు, రెండు జతల సాక్స్‌లు బ్యాగ్‌లో పెట్టి విద్యార్థులందరికీ అందిస్తారు.

నాణ్యతలో రాజీ పడకుండా...

విద్యార్థులకు అందించే జగనన్న విద్యాకానుకలోని వస్తువుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా అధికారులు కసరత్తు చేశారు. అందులో భాగంగా ఉన్నతాధికారులు వీటిపై ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. యూనిఫాం, పుస్తకాలు, బూట్లు తదితర వస్తువుల నాణ్యతలో రాజీ పడకుండా పూర్తి స్థాయిలో వాటిని అందించే ఏర్పాట్లు చేస్తున్నారు.



పుస్తకాలను తరగతుల వారీగా సిద్ధం చేస్తున్న విద్యాశాఖ అధికారులు

విద్యా కానుక రెండో వారంలో పంపిణీ



ఈనెల రెండో వారంలో పాఠశాలలు తెరచుకోనున్నాయి. విద్యార్థులు పాఠశాలకు వచ్చిన తొలిరోజే జగనన్న విద్యా కానుక అందించేందుకు కసరత్తు చేస్తున్నాం. ఎమ్మార్సీలకు చేరిన జగనన్న విద్యాకానుక కిట్స్ అక్కడ నుంచి పాఠశాలలకు తరలించి విద్యార్థులకు అందించనున్నారు. విద్యాకానుక చాలా నాణ్యతగా ఉండేలా ప్రభుత్వం జాగ్రత్త తీసుకుంది.

– పి.రమేష్, జిల్లా విద్యాశాఖాధికారి

జగనన్న కానుక విద్యార్థులకు వరం



జగనన్న విద్యా కానుక వలన చక్కగా అన్ని సబ్జెక్టుల పుస్తకాలు, బ్యాగ్స్, షూస్, డిక్షనరీ కూడా ఇవ్వడం విద్యార్థులకు చాలా ఉపయోగకరంగా ఉంది. ప్రభుత్వ పాఠశాలను సమీప పాఠశాలలో కలిపి సబ్జెక్టుల వారీగా బోధించటం వలన చాలా బాగుంది. విద్యార్థులు చక్కగా చదువుకోవటానికి అన్ని సౌకర్యాలు బాగున్నాయి.

– వినీల, నాల్గో తరగతి, వీ.కే ప్రభుత్వ ఉన్నత పాఠశాల, తాళ్లూరు

మండలాల వారీగా జగనన్న విద్యాకానుక అందుకోనున్న విద్యార్థుల సంఖ్య:

మండలం	విద్యార్థుల సంఖ్య
అర్ధవీడు	4,250
బేస్తవారిపేట	5,109
సీఎస్‌పురం	4,136
చీమకుర్తి	6,623
కంభం	5,072
దర్శి	10,001
దొనకొండ	6,570
గిద్దలూరు	8,452
హెచ్.ఎంపాడు	3206
కనిగిరి	9,316
కొమరోలు	4,312
కొనకనమిట్ల	5,879
కొండపి	3,306
కొత్తపట్నం	6,129
కురిచేడు	5,474
మద్దిపాడు	4,044
మార్కాపురం	12,105
మర్రిపూడి	4,406
ముండ్లమూరు	6,205
నాగులుప్పలపాడు	4,662
ఒంగోలు	8,800
పీసీపల్లి	3,357
పెద్దదోర్నాల	7,125
పామూరు	5,542
పెద్దారవీడు	6,216
పొదిలి	6262
పొన్నలూరు	3,362
పుల్లలచెరువు	5,978
రాచర్ల	3,643
సంతనూతలపాడు	4,637
సింగరాయకొండ	4,861
తాళ్లూరు	3,955
టంగుటూరు	4,091
తర్లుపాడు	4,837
త్రిపురాంతకం	7,614
వెలిగండ్ల	4,180
యర్రగొండపాలెం	10,397
జరుగుమల్లి	2,966
మొత్తం విద్యార్థులు	2,17,080



బేస్తవారిపేటలో తనిఖీ చేస్తున్న జిల్లా విద్యాశాఖాధికారి రమేష్

ప్రజలందరికీ కృష్ణుడి ఆశీస్సులుండాలి



విగ్రహ ప్రతిష్ఠలో పాల్గొన్న ఎమ్మెల్యే, మాజీమంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి



ధ్వజస్తంభానికి నమస్కరిస్తున్న ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి తదితరులు

- శ్రీకృష్ణ భగవాన్ దేవాలయం పునఃప్రతిష్ఠలో పాల్గొన్న బాలినేని, మాగుంట
- అంగరంగ వైభవంగా దేవాలయం పునః ప్రతిష్ఠ

ఒంగోలు టౌన్: ఒంగోలు నగర ప్రజలతో పాటుగా జిల్లాలోని ప్రజలందరికీ శ్రీ కృష్ణ భగవానుడి ఆశీస్సులు ఉండాలని, ప్రజలంతా సుఖ శాంతులతో వర్ధిల్లాలని ప్రార్థించినట్లు మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. నగరం నడిబొడ్డున ఉన్న గోపాల్‌నగర్‌లోని ట్రంక్‌రోడ్డు చౌరస్తాలో బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించిన శ్రీ కృష్ణ భగవాన్ దేవాలయ పునః ప్రతిష్ఠా మహోత్సవంలో ఆయన ప్రత్యేక పూజలు చేశారు. సర్వాంతర్యామి అయిన భగవంతుడు అందరివాడని అన్నారు. భగవంతుడు అందరినీ చల్లగా చూడాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. గుడి పునః ప్రతిష్ఠ చేయడానికి ఎవరు ఎలాంటి సహాయ సహకారాలు అందజేసినా వారందరి ఉద్దేశం లోకకళ్యాణ ఒక్కటే అన్నారు. 50 ఏళ్లకు పైగా చరిత్ర కలిగిన ఈ కృష్ణ మందిరం దేవాలయంగా రూపాంతరం చెందడం వల్ల నగర ప్రజలకు మంచి జరుగుతుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. దేవాలయ పునఃప్రతిష్ఠ కోసం అహర్నిశలు పాటుపడిన నిమ్మకాయల శ్రీనివాస్, గోపాలనగర్‌కు చెందిన యువకులు, పెద్దలందరికీ ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. దేవాలయ పునః ప్రతిష్ఠకు పెద్ద ఎత్తున తరలి వచ్చిన భక్తులందరినీ అభినందించారు. మాగుంట కుటుంబానికి కృష్ణ భగవానుడి మందిరంతో ఏళ్ల తరబడి అనుబంధం ఉందని ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి గుర్తు చేసుకున్నారు. ఒంగోలు పార్లమెంటు సభ్యుడిగా ఎన్నికల్లో పోటీ చేసిన మాగుంట సుబ్బరామి రెడ్డి ఇక్కడికి వచ్చి కృష్ణ భగవానుడి ఆశీస్సులు తీసుకున్న తరువాతనే నామినేషన్ వేయడానికి వెళ్లడం ఆనవాయితీగా ఉండేదన్నారు. ఆ స్వామివారి ఆశీస్సులతోనే మాగుంట కుటుంబం ఇన్నాళ్లుగా ప్రజాసేవ చేస్తోందన్నారు. దేవాలయ పునర్నిర్మాణానికి చేయూతనందించిన ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అంతటి సహృదయుడు జిల్లాలో మరొకరు లేరని దేవాలయ పునః ప్రతిష్ఠలో ముఖ్యపాత్ర పోషించిన నిమ్మకాయల శ్రీనివాస్ అన్నారు. విగ్రహ ప్రతిష్ఠకు సహకరించిన ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డికి ధన్యవాదాలు తెలిపారు. అలాగే పేద, ధనిక తారతమ్యం లేకుండా దేవాలయ పునః నిర్మాణానికి తమ వంతుగా సహాయ సహకారాలు అందించిన దాతలు ఇచ్చిన ప్రోత్సాహాన్ని ఎన్నటికీ మరిచిపోలేనని చెప్పారు. తొలుత భక్తులు హరే కృష్ణ..హరే కృష్ణ నామస్మరణల మధ్య, గోవింద గోవింద నామస్మరణ మధ్య ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించారు. నూతన దేవాలయ పునఃప్రతిష్ఠా కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నగర నాయకుడు కఠారి శంకర్, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు గోలి తిరుపతిరావు, ఒంగోలు వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఘనశ్యాం, కార్పొరేటర్లు తిరుమలరావు, ఎందేటి పద్మావతి రంగారావు, జగన్ అభిమాన సంఘం అధ్యక్షుడు అరుణ్ బాబు తదితరులు పాల్గొన్నారు. అనంతరం పెద్ద సంఖ్యలో భక్తులకు అన్నదానం చేశారు.

పాపం పసికందు..!

- గోనె సంచిలో పసికందు..!
- తినేందుకు యత్నించిన పందులు
- గిద్దలూరులో దారుణం
- రక్షించిన స్థానికులు



గోనె సంచిలో చుట్టి ఉన్న పసికందు



వైద్యశాలలో చికిత్స పొందుతున్న పసికందు

గిద్దలూరు రూరల్: అప్పుడే పుట్టిన పసికందును గుర్తు తెలియని వ్యక్తులు మానవత్వాన్ని మరచి గోనె సంచిలో కట్టి తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో పడేశారు. సంచిలో ఉన్న చిన్నారిని తినేందుకు అక్కడ సంచరిస్తున్న పందులు యత్నించాయి. స్థానికులు, రెవెన్యూ అధికారులు గమనించి పందులను తరిమేసి రక్షించారు. గిద్దలూరు పట్టణంలో బుధవారం జరిగిన ఈ హృదయ విదారక ఘటన అందర్నీ కలచివేసింది. పట్టణంలో సంచలనం రేకెత్తించిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. ఎప్పుడూ రద్దీగా ఉండే తహసీల్దార్ కార్యాలయం ఆవరణలో ఉన్న చెత్త కుండీలో గుర్తు తెలియని వ్యక్తులు గోనెసంచిలో పసికందును చుట్టి పడేశారు. సాయంత్రం నాలుగు గంటల సమయంలో చెత్త కుండీలో ఉన్న గోనె సంచిని పందులు వెలుపలికి తీశాయి. లోపల ఉన్న చిన్నారిపై దాడికి యత్నించాయి. అదే సమయంలో పసికందు ఏడవడం మొదలు పెట్టాడు. కార్యాలయానికి వచ్చిన పట్టణ వాసులు, రెవెన్యూ అధికారులు చిన్నారి ఏడుపును గమనించారు. వెంటనే పందులను అక్కడ నుంచి తరిమేసి పసికందు ప్రాణాలు రక్షించారు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. అనంతరం సీఐ ఫిరోజ్, ఎస్సై బ్రహ్మనాయుడు సంఘటనా స్థలానికి చేరుకుని పసికందును గిద్దలూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. శిశువు ఆరోగ్యంగా ఉన్నట్లు వైద్యులు నిర్ధారించారు. సీసీ కెమెరాల ఆధారంగా రెవెన్యూ కార్యాలయంలో ఎవరు పడేశారన్నది గుర్తిస్తామని సీఐ తెలిపారు.

అన్ని వర్గాల నాయకుడు అంబేడ్కర్

- మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి
- వల్లూరులో పలు ప్రారంభోత్సవాలు
- పాల్గొన్న బాలినేని, ఎంపీ మాగుంట, జెడ్పీ చైర్‌పర్సన్ వెంకాయమ్మ, వరికూటి అశోక్‌బాబు



వల్లూరమ్మ ఆలయంలో కళ్యాణ మండపాన్ని ప్రారంభిస్తున్న బాలినేని శ్రీనివాసరెడ్డి



వల్లూరు సచివాలయంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న మాగుంట శ్రీనివాసులరెడ్డి

టంగుటూరు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ పేద దళిత వర్గాలకే కాదు, అన్ని వర్గాలకు నాయకుడని మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి అన్నారు. మండలంలోని వల్లూరులో వేంచేసిన వల్లూరమ్మ ఆలయంలో కిమ్స్ ఆస్పత్రి యాజమాన్యం తాళ్లూరి గిరి, బొల్లినేని భాస్కర్ సహకారంతో ఆధునీకీకరించిన కల్యాణ మండపాన్ని బాలినేని శ్రీనివాసరెడ్డి, జలజీవన్ మిషన్ నిధులు రూ.26.69 లక్షలతో నిర్మించిన వాటర్ హెడ్‌ట్యాంక్‌ను జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, గ్రామ సచివాలయంలో ఏర్పాటు చేసిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహాన్ని మాగుంట శ్రీనివాసులరెడ్డి, వైఎస్సార్ సీపీ కొండపి నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరికూటి అశోక్‌బాబుతో కలిసి బుధవారం ప్రారంభించారు. తొలుత వల్లూరమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ఈవో రమేష్, ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ కాలె శ్రీనివాసులు, అర్చకులు మేళతాళాలు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా నాలుగేళ్ల పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో బాలినేని మాట్లాడుతూ బీఆర్ అంబేడ్కర్ రాసిన రాజ్యాంగం వలనే జగనన్న వరికూటి అశోక్‌బాబు లాంటి వారికి పదవులు కల్పించారని.. ఇంకా ఉద్యోగాలు వస్తున్నాయన్నారు. ఎంపీ మాగుంట శ్రీనివాసులరెడ్డి మాట్లాడుతూ వల్లూరు గ్రామంతో తమ కుటుంబానికి దాదాపు 35 ఏళ్ల నుంచి విడదీయలేని అనుబంధం ఉందన్నారు. సచివాలయం ముందు అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటు చేయటం సంతోషకరమని చెప్పారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఈ నాలుగేళ్లలో నవరత్నాల పథకాలైన నాడు–నేడు, అమ్మఒడి, విద్యా దీవెన, వసతి దీవెన అందిస్తూ విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. అన్ని రంగాల్లో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అందించారని చెప్పారు. వరికూటి అశోక్‌బాబు మాట్లాడుతూ టీడీపీ హయాంలో బలహీన వర్గాలకు ఎక్కడా స్వేచ్ఛ లేదని, జన్మభూమి కమిటీల వద్ద లంచాలు ఇచ్చి పని చేయించుకోవాల్సి వచ్చేదన్నారు. అంబేడ్కర్ ఆలోచనలని తూచా తప్పకుండా పాటిస్తుంది ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఒక్కరేనన్నారు. ప్రతి 50 ఇళ్లకు వలంటీరును పెట్టి సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు, మండల జేసీఎస్ కన్వీనర్ చింతపల్లి హరిబాబు, జెడ్పీటీసీ మన్నం అరుణకుమారి, నాయకులు కుందం హనుమారెడ్డి, సర్పంచ్ వల్లూరి పద్మ, ఎంపీటీసీ యలసిరి సత్యవాణి, పార్టీ నాయకులు సనగర కోటేశ్వరరావు, కుందం శేఖర్‌రెడ్డి, కుందం శ్రీనివాసరెడ్డి, విష్ణువర్ధన్ రెడ్డి, భవనం వెంకారెడ్డి, సింగరాయకొండ వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్‌రెడ్డి, టంగుటూరు సొసైటీ డైరెక్టర్ ఉప్పలపాటి నాగరాజు, ఎంపీడీఓ రత్నజ్యోతి తదితరులు పాల్గొన్నారు.

రైతు పక్షపాతి జగనన్న

- రాష్ట్ర పురపాలక శాఖా మంత్రి ఆదిమూలపు సురేష్



రైతు భరోసా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్



లబ్ధిదారుడికి సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న మంత్రి ఆదిమూలపు సురేష్

యర్రగొండపాలెం: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు మేలు చేసే కార్యక్రమాలు చేపట్టి వారి అభ్యున్నతికి పాటుపడుతున్నారని, వ్యవసాయానికి సంబంధించిన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలను ఎటువంటి వ్యయ, ప్రయాస లేకుండా గ్రామంలోనే పొందేలా రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారని రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ అన్నారు. మండలంలోని గంగపాలెంలో రూ.21.80 లక్షల ఖర్చుతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని బుధవారం ఆయన ప్రారంభించారు. ప్రకృతి వైపరీత్యాలతో నష్ట పోయిన రైతులకు వెనువెంటనే పరిహారం, సీజన్‌లో పంటలు వేసుకోవటానికి అయ్యే ఖర్చు రైతు భరోసా పథకం ద్వారా అందజేస్తున్నారని అన్నారు. అనంతరం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సమస్యలు తెలుసుకోవటానికే గడప గడపకు మన ప్రభుత్వం

ప్రజల సమస్యలను తెలుసుకొని తక్షణమే పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని చేపట్టి తమ ఇంటిముంగిటకు అన్ని శాఖలకు చెందిన అధికారులను పంపుతున్నారని మంత్రి సురేష్ అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలు ఏమేరకు లబ్ధిపొందారు, ఇంకా ఏమైనా అవసరం ఉందా అని ఆయన అడిగి తెలుసుకున్నారు. జగనన్న అన్ని వర్గాల పేద ప్రజల అభ్యున్నతికి పాటుపడుతున్నారని, ఈ మేరకు నవరత్నాల పథకాలను క్రమం తప్పకుండా అమలు పరుస్తున్నారని అన్నారు. ప్రభుత్వ పథకాల అమలుపై సంక్షేమ క్యాలెండర్ విడుదల చేసిన ముఖ్యమంత్రిని గతంలో తాము చూడలేదని, చిత్తశుద్ధితో తమ ముఖ్యమంత్రి క్యాలెండర్ విడుదల చేశారని అన్నారు. నాలుగేళ్లుగా సంక్షేమ పథకాలపై ప్రతి పక్షాలు గగ్గోలు పెట్టాయని, లబ్ధిదారుల అకౌంట్‌లలో నేరుగా నగదు జమ చేయడం ఇష్టంలేని టీడీపీ నాయకులు రాష్ట్రం ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేస్తున్నారని విమర్శలకు దిగారని అన్నారు. ఏదో ఒక విధంగా సంక్షేమ పథకాలు ప్రజల వద్దకు చేరకుండా చేయాలన్నదే వారి ప్రధాన ధ్యేయమని విమర్శించారు. కార్యక్రమంలో ఏఎంసీ జెడ్పీటీసీ చేదూరి విజయభాస్కర్, మండల పార్టీ అధ్యక్షుడు కె.ఓబుల్‌రెడ్డి, జిల్లా పరిషత్ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ షాబీర్‌బాషా, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు రాములు నాయక్, సర్పంచ్‌లు రాగాల లక్ష్మమ్మ, సుబ్బారెడ్డి, డీఎల్‌డీవో బి.వి.ఎస్. సాయికుమార్, తహసీల్దార్ కె.దాసు, ఏవో పి.వెంకటేశ్వర్లు, ఏఈలు మహంకాళయ్య, శ్రీకాంత్, అల్లూరయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

వృద్ధుడి కిడ్నాప్ కలకలం?


కిడ్నాప్‌కు గురైన రామిరెడ్డి

బేస్తవారిపేట: కొందరు వ్యక్తులు ఓ వృద్ధుడిని బలవంతంగా కారులో ఎక్కించి తీసుకెళ్లిన సంఘటన బేస్తవారిపేట మండలంలోని పూసలపాడు గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. అందిన సమాచారం మేరకు వివరాలు.. పెదదోర్నాలకు చెందిన పెద్దిరెడ్డి రామిరెడ్డి(70) గత కొన్నేళ్లుగా పూసలపాడు గ్రామంలో ఉంటున్నారు. అక్కడే వీరబ్రహ్మేంద్రస్వామి ఆలయం నిర్మించి ఆధ్యాత్మిక జీవితం గడుపుతున్నారు. బుధవారం ఏపీ39డిజె2999 కారులో వచ్చిన కొందరు వ్యక్తులు బలవంతంగా రామిరెడ్డిని ఎక్కించుకుని తీసుకెళ్లిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని విచారణ చేపట్టారు. రామిరెడ్డికి హైవే రోడ్డు వెంట పొలం ఉందని, దాన్ని విక్రయించే విషయంలో వివాదం నెలకొందని తెలిసింది. ఆ వ్యక్తిని కార్లో తీసుకెళ్లిన వ్యక్తులు పొలం వివాదానికి సంబంధించిన వారా? లేక బంధువులా అనే విషయం పోలీసుల విచారణలో తెలియాల్సి ఉంది. పోలీసులు సీసీ ఫుటేజీలు పరిశీలిస్తున్నారు. చెక్ పోస్టుల వద్ద, హైవే రోడ్డుపై గస్తీ ఏర్పాటు చేశారు.

మహిళా రెజ్లర్లకు ఇచ్చే గౌరవం ఇదేనా?

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

ఒంగోలు టౌన్: దేశ ప్రతిష్టను ప్రపంచం నలుమూలలా ఎలుగెత్తి చాటిన మహిళా క్రీడాకారులను నిర్బంధించిన కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం స్థానిక సుందరయ్య భవనంలో నిర్వహించిన సీపీఎం రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. తమతో అనుచితంగా ప్రవర్తించిన బీజేపీ ఎంపీ బ్రిజ్ భూషణ్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఆందోళన చేస్తున్న మహిళా రెజ్లర్లను అత్యంత పాశవికంగా పోలీసులు ఎత్తి బస్సులో పడేయడం దారుణమన్నారు. దేశానికి అనేక పతకాలు తెచ్చిన వినేష్ ఫోగట్, ఆమె సోదరి సంగీతా ఫోగట్, టోక్యో ఒలింపిక్ పతక విజేత బజరంగ్ పూనియా, రియో ఒలింపిక్ విజేత సాక్షి మాలిక్‌తో పోలీసులు ప్రవర్తించిన తీరు సమర్థనీయం కాదన్నారు. మహిళా క్రీడాకారులను గౌరవించే విధానం ఇదేనా అని ప్రశ్నించారు. సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు పూనాటి ఆంజనేయులు, జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్, కంకణాల ఆంజనేయులు, జీవీ కొండారెడ్డి, షేక్ మహబూబ్, డి.సోమయ్య, చీకటి శ్రీనివాసరావు, వెల్లంపల్లి ఆంజనేయులు, ఎం.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నృసింహుని బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

● వైభవంగా ధ్వజారోహణం
● భక్తులకు కొడిముద్ద పంపిణీ
● చంద్రప్రభ వాహనంపై దర్శనమిచ్చిన స్వామివారు

సింగరాయకొండ: దక్షిణ సింహాచలంగా పేరుగాంచిన పాతసింగరాయకొండలోని వరాహ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఘట్టమైన ధ్వజారోహణ కార్యక్రమం బుధవారం ఉదయం అత్యంత వైభవంగా నిర్వహించారు. స్వామివారి బ్రహ్మోత్సవ సంబరాలకు ముక్కోటి దేవతలందరినీ ఆహ్వానించేందుకు జయజయ ధ్వానాలు, మంగళవాద్య, వేదఘోషలు పఠిస్తూ గరుత్మంతుని ధ్వజస్తంభం పైకి ఎగురవేశారు. ఈ సందర్భంగా భక్తులకు స్వామివారి ప్రసాదంగా కొడిముద్ద పంపిణీ చేశారు. కొడిముద్ద తిన్న మహిళలకు సంతానం కలుగుతుందని, అనారోగ్యంగా ఉన్న వారు ఆరోగ్యవంతులవుతారని భక్తుల నమ్మకం. ధ్వజారోహణ ముగిసిన తర్వాత స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి గ్రామోత్సవం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి స్వామి వారు చంద్రప్రభ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. గురువారం ఉదయం సూర్యప్రభ వాహనం, రాత్రికి హంస వాహనంపై స్వామి వారు దర్శనమిస్తారని ఈఓ పి.కృష్ణవేణి వివరించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లను ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ పామర్తి మాధవరావు, సభ్యులు పర్యవేక్షించారు.


ధ్వజారోహణం నిర్వహిస్తున్న వేదపండితులు


విద్యుద్దీపాలంకరణలో వరాహ లక్ష్మీనరసింహ స్వామి దేవస్థానం


చంద్రప్రభ వాహనంపై నరసింహస్వామి

సినీ ఫక్కీలో రూ.1.50 లక్షల చోరీ

చీమకుర్తి: బ్యాంక్‌లో డ్రా చేసి స్కూటీ సీటు కింద పెట్టిన రూ.2 లక్షల్లో రూ.1.50 లక్షలను గుర్తు తెలియని ఇద్దరు వ్యక్తులు సినీఫక్కీలో చోరీ చేశారు. ఎస్సై రమేష్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... నాయుడుపాలెం గ్రామానికి చెందిన బొమ్మల సామ్యేల్ చీమకుర్తిలోని స్టేట్ బ్యాంక్‌లో రూ.2 లక్షలు డ్రా చేశాడు. నాలుగు కట్టలుగా ఉన్న నగదును స్కూటీ సీటు కింద ఉంచి స్కూటీతో చీమకుర్తిలోని కార్పొరేషన్ బ్యాంక్ ఎదుట ఉంచి బంగారం తాకట్టు పెట్టి మరో రూ.2 లక్షలు తీసుకుందామని బ్యాంక్‌లోకి వెళ్లాడు. వెంటనే గుర్తు తెలియని నలుగురు వ్యక్తులు రెండు బైకులపై వచ్చి ఇద్దరు రోడ్డు మీద నిలబడి ఉన్నారు. మరో ఇద్దరు నేరుగా స్కూటీ వద్దకు వచ్చి స్కూటీ సీటును బలంగా పైకి లేపి చేతిని లోపల పెట్టి మొదట రెండు కట్టలుగా ఉన్న రూ.లక్ష బయటకు తీశారు. మళ్లీ చెయ్యి పెట్టి ఒక కట్ట మాత్రమే అందినట్లు ఉంది. దాన్ని తీసుకొని హడావుడిగా ఇద్దరు వ్యక్తులు చీమకుర్తి పట్టణంలోకి వెళ్లగా..మరో ఇద్దరు చీమకుర్తి నుంచి ఒంగోలు వైపు వెళ్లారు. ఇదంతా బ్యాంక్ ఎదుట ఉన్న సీసీ కెమెరాల్లో రికార్డ్ కావడంతో స్కూటీ నుంచి డబ్బులు ఎలా తీశారో బాధితుడు, పోలీసులు గుర్తించగలిగారు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో క్లూస్ టీం వేలిముద్రలు సేకరించారు. దొంగతనం జరిగిన విధానం చూస్తే బ్యాంక్‌లో సామ్యేల్ డ్రా చేసి స్కూటీ సీటు కింద పెట్టినప్పుడు నుంచే నిందితులు అనుసరించినట్లు పోలీసులు భావిస్తున్నారు. కాగా బాధితుడు సామ్యేల్ దివ్యాంగుడు. హైదరాబాద్‌లో బేల్దార్ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. కుమారుడు ఇటీవల పదో తరగతి పరీక్షలు ఫెయిల్ కావడంతో ఈ నెల 2వ తేదీ నుంచి అడ్వాన్స్ సప్లమెంటరీ పరీక్షలు ఉండటంతో పరీక్షలను రాయించుకొని 1వ తేదీన నాయుడుపాలెంలో పింఛన్ తీసుకొని హైదరాబాద్ వెళ్దామని అనుకున్నాడు. ఆయనకు దగ్గర బంధువులకు నాలుగు లక్షలు ఇవ్వాల్సి ఉంటే బంగారం తాకట్టు పెట్టి కొంత, తెలిసి వారి నుంచి కొంత నగదును స్టేట్ బ్యాంక్‌లో వేయించుకొని బంధువులకు ఇవ్వాలసిన అప్పు కింద ఇచ్చి హైదరాబాద్ వెళ్దామనుకున్నాడు సామ్యేల్. ఇంతలో ఇలా జరగటంతో సామ్యేల్, కుటుంబసభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎస్సై రమేష్‌రెడ్డి కేసు నమోదు చేశారు. సీసీ ఫుటేజీల ఆధారంగా వీలైనంత వరకు దొంగలను పట్టుకుంటామని తెలిపారు.


బ్యాంక్ ఎదుట స్కూటీ సీటు లేపి డబ్బులు తీస్తున్న గుర్తు తెలియని వ్యక్తులు

బాల కార్మికుల వ్యవస్థ నిర్మూలనే ధ్యేయం


మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

● కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్

ఒంగోలు అర్బన్: బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే ధ్యేయంగా ప్రత్యేక బృందాలు చిత్తశుద్ధితో పని చేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ కార్మిక శాఖ కమిషనర్ ఉత్తర్వుల మేరకు జూన్ మొత్తం కార్యక్రమాన్ని పక్కాగా నిర్వహించాలన్నారు. 14 ఏళ్ల లోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం చట్టరీత్యా నేరమని, అతిక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమం నిర్వహణ కోసం ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ బృందాలు జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో పర్యటించి 14 ఏళ్ల లోపు బాల కార్మికులను గుర్తించాలన్నారు. ఈ బృందంలో అసిస్టెంట్ లేబర్ అధికారి, పోలీసు, ఫ్యాక్టరీ ఇన్‌స్పెక్టర్, డీసీపీఓ, తహసీల్దార్లు ఉంటారన్నారు. సమావేశంలో ట్రైనీ ఐఏఎస్ శౌర్యపటేల్, అడిషనల్ ఎస్పీ నాగేశ్వరరావు, కార్మిక శాఖ సహాయ కమిషనర్లు అనితావాణి, పవన్‌కుమార్, కోటేశ్వరరావు, ఐసీడీఎస్ పీడీ ధనలక్ష్మి, డీఎంహెచ్ఓ రాజ్యలక్ష్మి, సాంఘీక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, ఇతర అధికారులు, ఎన్‌జీఓ ప్రతినిధులు పాల్గొన్నారు.

సత్తా చాటిన హుజూర్‌నగర్ ఎడ్లు


ఎడ్లజత యజమానులను సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

పెద్దారవీడు: మండలంలో గొబ్బూరు గ్రామం ఉయ్యాల పోలేరమ్మతల్లి, పోతురాజుస్వామి ప్రతిష్ఠ మహోత్సవం సందర్భంగా బుధవారం రాష్ట్రస్థాయి సీనియర్ ఒంగోలు జాతి వృషభరాజుల బలప్రదర్శన పోటీలు నిర్వహించారు. పోటీల్లో తెలంగాణ రాష్ట్రం సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన సుంకి సురేందర్‌రెడ్డి ఎడ్లజత 2,964 అడుగులు లాగి మొదటి స్థానంలో సత్తా చాటి రూ 80 వేలు అందజేశారు. రెండో స్థానంలో నంద్యాల జిల్లా బిల్లాపురం గ్రామానికి చెందిన భూమా గోవర్ధన్‌రెడ్డి ఎడ్లజత 2401 అడుగులు లాగి రూ.60 వేలు, మూడవ స్థానంలో నంద్యాల జిల్లా జిల్లిలా గ్రామానికి చెందిన గొట్టిక రవితేజాస్వారరెడ్డి ఎడ్లజత 2375 అడుగులు లాగి రూ.50 వేలు, నాల్గవ స్థానంలో జేసీ అగ్రహారం గ్రామానికి చెందిన లక్కు నాగ శివశంకర్ ఎండ్ల జత 2,115 అడుగులు లాగి రూ.40 వేలు, ఐదవ స్థానంలో గుంటూరు జిల్లా కుంచనపల్లి గ్రామానికి చెందిన పీఆర్ మెమోరియల్ పులగం త్రిషష్ఠరెడ్డి ఎడ్ల జత 2013 అడుగులు లాగి రూ.30 వేలు, ఆరో స్థానంలో బల్లికురవ పాలూరి వీరస్వామి, బాలరాజు ఎడ్లు కలిసి 1879 అడుగులు లాగి రూ.20 వేలు, ఏడో స్థానంలో బ్రహ్మణపల్లె గ్రామానికి చెందిన దుప్పిలి అంజిరెడ్డి ఎడ్లజత 1781 అడుగులు లాగి రూ.10 వేలు బహుమతులు అందజేశారు. మిగిలిన ఎడ్లజత యజమానులకు రూ.5 వేలు అందజేశారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి


వ్యక్తి మృతదేహం

గిద్దలూరు రూరల్: పట్టణంలోని రైల్వేస్టేషన్ ఆవరణలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. అందిన వివరాల ప్రకారం..50 ఏళ్ల వయసున్న వ్యక్తి రైల్వేస్టేషన్ ప్లాట్‌ఫాంపై పడుకొని అలాగే మృతి చెందాడు. మృతుని వ్యక్తి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. అనారోగ్యం కారణంగా లేక వడదెబ్బతో మృతి చెంది ఉండొచ్చని భావిస్తున్నారు. మృతుడు ముదురు గోధుమరంగు కలర్ చొక్కా, తెల్ల పంచ ధరించి ఉన్నాడు. మృతుడిని గుర్తుపట్టిన వారు నంద్యాల జీఆర్‌పీఎఫ్ పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

గిరిపుత్రులకు సౌకర్యాలు భేష్


ఐటీడీఏ పీఓ రవీంద్రరెడ్డితో కేఎల్‌యూ విద్యార్థులు

● చెంచుల జీవన విధానంపై కేఎల్‌యూ విద్యార్థుల సర్వే
● విజయవంతంగా పూర్తయిన సోషల్ ఇంటర్న్‌షిప్

యర్రగొండపాలెం: అటవీ ప్రాంతంలో జీవించే చెంచు గిరిజనులకు ప్రభుత్వ సహకారంతో ఐటీడీఏ మంచి సౌకర్యాలు కల్పిస్తోందని విజయవాడ కేఎల్ యూనివర్శిటీ విద్యార్థులు పేర్కొన్నారు. మే నెలలో కేఎల్ యూనివర్శిటీకి చెందిన విద్యార్థుల బృందం చెంచుల జీవన విధానంపై 10 రోజులపాటు సర్వే చేసింది. ముగ్గురు మెంటార్లు ఫార్మసీ విభాగానికి చెందిన డాక్టర్ కటారి సుకీర్తి, మెంటార్ ఎస్ఏసీ బి.రామ్‌బాబు, సైకాలజీ విభాగానికి చెందిన అభయ్‌తోపాటు 40 మంది విద్యార్థుల బృందం నల్లమల అటవీ ప్రాంతంలోని చెంచుల పరిస్థితిపై అధ్యాయనం చేసింది. చెంచుల సౌకర్యార్థం అంతర్గత అటవీ ప్రాంతంలో సౌర విద్యుత్ వెలుగులు, మంచి నీటి పైపులైన్ల సౌకర్యం ఆశ్చర్యం కలిగించిందని విద్యార్థులు పేర్కొన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేసి చిన్నారులు, గర్భిణులకు మంచి పౌష్టికాహారాన్ని అందించడం హర్షణీయమన్నారు. అటవీ ప్రాంతంలో ఆరోగ్య సౌకర్యాలు కూడా మెరుగ్గా ఉన్నాయన్నారు. ఈసా అడిషనల్ డైరెక్టర్ రవీంద్రబాబు, రాష్ట్ర ఆరోగ్య కో ఆర్డినేటర్ డీఎస్ మూర్తి, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి డాక్టర్ రవీంద్రరెడ్డి, డీవైఎంహెచ్ఓ డాక్టర్ ఎం.శ్రీనివాసరావు, మెడికల్ అధికారి డాక్టర్ కోట నాయక్, ట్రైబల్ కళాశాల ప్రిన్సిపాల్ వి.రాజేంద్రబాబు, అంబులెన్స్ డ్రైవర్ వెంకటరామయ్య సర్వేకు సహకరించారని తెలిపారు.

టెన్త్ సప్లిమెంటరీకి పకడ్బందీ ఏర్పాట్లు

● డీఆర్‌ఓ శ్రీలత

ఒంగోలు అర్బన్: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 2 నుంచి 10వ తేదీ వరకు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా రెవెన్యూ అధికారి శ్రీలత సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం ప్రకాశం భవనంలో పరీక్షల నిర్వహణపై ఏర్పాటు చేసిన సమావేశంలో డీఆర్‌ఓ మాట్లాడారు. జిల్లాలో 8,016 మంది విద్యార్థులు సప్లిమెంటరీ పరీక్షలకు హాజరవుతున్నారని, వీరికోసం 44 కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద ఆర్మ్‌డ్ గార్డ్స్‌ను ఏర్పాటు చేయాలని, 144 సెక్షన్ విధించాలని చెప్పారు. పరీక్ష సమయంలో కేంద్రాల సమీపంలోని జిరాక్స్, ఇంటర్నెట్ కేంద్రాలు మూసివేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఎండల తీవ్రతను దృష్టిలో ఉంచుకుని ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లతో పాటు ఏఎన్ఎంలను అందుబాటులో ఉంచాలన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు సకాలంలో చేరుకునేలా ఆర్టీసీ బస్సు సౌకర్యం కల్పించాలన్నారు. సమావేశంలో విద్యా శాఖ, పోలీసు శాఖ అధికారులు పాల్గొన్నారు.

యువకుని మృతదేహం వెలికితీత

మద్దిపాడు: మండలంలోని గుండ్లాపల్లిలో మంగళవారం ఉదయం నీటికుంటలో పడిపోయిన యువకుని మృతదేహం బుధవారం ఉదయం పైకి తేలడంతో స్థానికులు వెలికితీశారు. పోలీసులు అందించిన సమాచారం ప్రకారం..గుండ్లాపల్లి గ్రామానికి చెందిన కోప్పోలు శ్రీనివాసరావు(36) గ్రామ సచివాలయంలో వలంటీర్‌గా పని చేస్తున్నాడు. మంగళవారం ఉదయం ఇంట్లోని వారిపై అలిగి నీటికుంట వద్దకు వెళ్లి చెప్పులు కళ్లజోడు ఒడ్డున ఉంచి నీటిలోకి దూకాడు. ఈ క్రమంలో యువకుని తండ్రి అంకమ్మరావు గ్రామంలో పలు చోట్ల వెతికి చివరిగా నీటికుంట వద్దకు వెళ్లి చూడగా..చెప్పులు, కళ్లజోడు తన కుమారునివిగా గుర్తించి విషయం స్థానికులకు తెలిపాడు. నీటికుంట ఎక్కువ లోతు ఉండడంతో శ్రీనివాసరావు మృతదేహం వెళ్లిపోయింది. కొలచనకోట నుంచి గజ ఈతగాళ్లు వచ్చి రాత్రి పొద్దు పోయే వరకు గాలించినా ప్రయోజనం లేదు. బుధవారం ఉదయం శ్రీనివాసరావు మృతదేహం పైకి తేలడంతో స్థానికులు వెంటనే మద్దిపాడు పోలీసులకు సమాచారం చేరవేయగా ఏఎస్సై రమేష్ కృష్ణ ఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని పరిశీలించారు. శ్రీనివాసరావు మృతదేహాన్ని వెలికితీయడంతో తల్లిదండ్రులు, బంధువులు బోరున విలపించారు. మృతునికి ఏడాది క్రితమే వివాహమైంది. మద్దిపాడు పోలీసులు మృతదేహాన్ని ఒంగోలు జీజీహెచ్‌కు తరలించి పోస్టుమార్టం నిర్వహించి ఆతని కుటుంబసభ్యులకు అందించారు.


యువకుని మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బాలినేని చొరవతో వేగంగా షాదీఖానా పనులు

ఒంగోలు: ఒంగోలు ఎమ్మెల్యే, మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి చొరవతో షాదీఖానా నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. గత టీడీపీ ప్రభుత్వంలో షాదీఖానా నిర్మాణాన్ని నిర్లక్ష్యం చేసి కాంట్రాక్టరుకు బకాయిలు చెల్లించకపోవడంతో నిర్మాణ పనులు నిలిచిపోయిన విషయం తెలిసిందే. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి నేరుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. ప్రభుత్వం బకాయిలు చెల్లించడంతో కాంట్రాక్టర్ పనులను వేగవంతం చేశారు. బుధవారం షాదీఖానా మొదటి అంతస్తు శ్లాబు నిర్మించగా, మున్సిపల్ డీఈ గణపతి ఆధ్వర్యంలో సాంకేతిక సిబ్బంది పర్యవేక్షించారు. దీనిపై ఎమ్మెల్యే బాలినేని మాట్లాడుతూ అభివృద్ధి పనుల విషయంలో ఎక్కడా రాజీపడేదిలేదన్నారు. షాదీఖానాకు నిధుల విడుదల విషయంపై ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవ చూపారని, నిర్ణీత సమయంలో పూర్తిచేసి మైనార్టీలకు అందజేస్తామని హామీ ఇచ్చారు.


షాదీఖానా మొదటి అంతస్తుకు శ్లాబు నిర్మిస్తున్న దృశ్యం

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

● విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏఎస్పీ భవానీహర్ష

పొదిలి రూరల్: రైతులకు నకిలీ విత్తనాలు అంటగట్టినా, అధిక ధరలకు విక్రయించినా కఠిన చర్యలు తప్పవని డీలర్లను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ భవానీహర్ష హెచ్చరించారు. బుధవారం పొదిలిలోని విత్తనాల దుకాణాల్లో తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఏఎస్పీ మాట్లాడుతూ.. పొదిలిలో భవానీ ఫెర్టిలైజర్స్ అండ్ పెస్టిసైడ్స్, శ్రీ లక్ష్మి శ్రీనివాస ఏజెన్సీస్, వెంకటేశ్వర కాఫీ అండ్ జనరల్ స్టోర్స్‌ను తనిఖీ చేసినట్లు చెప్పారు. రికార్డులు సరిలేక పోవడంతో సూమారు రూ.9.5 లక్షల విలువ చేసే విత్తనాల విక్రయాన్ని నిలుపుదల చేసినట్లు చెప్పారు. రికార్డులు సక్రమంగా పూర్తి చేసిన తర్వాత అధికారుల అనుమతితో తిరిగి విక్రయించుకోవచ్చని డీలర్లకు స్పష్టం చేశారు. రైతులను మోసం చేసే డీలర్లపై పీడీ యాక్టు నమోదు చేస్తామని హెచ్చరించారు. ప్రజలు కూడా నకిలీ విత్తనాల విక్రయాలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. రైతులు నష్టపోకుండా ఉండాలంటే అధికారులు సూచించిన కంపెనీల విత్తనాలనే కొనుగోలు చేసి బిల్లులు జాగ్రత్తగా ఉంచుకోవాలన్నారు. ఆయన వెంట విజిలెన్స్ సీఐ కె.రాఘవరావు, కె.వెంగళరెడ్డి, వ్యవసాయాధికారి ఎస్కే జైనులాబ్దిన్, విజిలెన్స్ ఏఓ సంగమేశ్వరరెడ్డి తదితరులు ఉన్నారు.


విత్తన దుకాణాన్ని తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు